క్లుప్తంగా

ఎమ్మెల్సీ పరామర్శ



శివ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ సురేష్‌బాబు

నెల్లిమర్ల: జేఎల్‌ఎం మద్దిల శివ కుటుంబాన్ని ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు బుధవారం పరామర్శించారు. నగర పంచాయతీ పరిధి జరజాపుపేటకు చెందిన శివ విధి నిర్వహణలో ఉండగా ఇటీవల మృతి చెందిన విషయం తెలిసిందే. మృతుడి కుటుంబ సభ్యులను ఎమ్మెల్సీ ఓదార్చి, ఎటువంటి అవసరమున్నా తనను సంప్రదించాలని సూచించారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన ప్రయోజనాలు త్వరితగతిన అందేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్సీ వెంట నగర పంచాయతీ వైస్‌చైర్మన్ సముద్రపు రామారావు, 18వ వార్డు పార్టీ కన్వీనరు నల్లి శ్రీనివాసరావు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు మన్యపురి మోహనరావు ఉన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన



బోడికొండ రహదారి పనులను పరిశీలిస్తున్న సీఈఓ అశోక్, తదితరులు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని రామతీర్థంలో జరుగుతున్న అభివృద్ధి పనులను జెడ్పీ సీఈఓ అశోక్‌కుమార్ బుధవారం పరిశీలించారు. రామతీర్థం నుంచి బోడికొండపైకి జిల్లా పరిషత్ నిధులతో చేపడుతున్న రోడ్డు పనులు, గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా నిర్మించిన ఫారంపాండ్‌ను పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గిరిబాల, ఈఓపీఆర్డీ భానోజీరావు, తదితరులు పాల్గొన్నారు.

లోక్‌అదాలత్‌ను వినియోగించుకోండి

కొత్తవలస: కేసుల సత్వర పరిష్కారమే లోక్‌అదాలత్ లక్ష్యమని, కక్షిదారులు లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని మండల లీగల్ కమిటీ చైర్మన్, కొత్తవలస జూనియర్ సివిల్ జడ్జి ఎస్.విజయ్‌చంద్ర బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 13న నిర్వహించనున్న మెగా లోక్‌అదాలత్‌లో కక్షిదారులందరూ పాల్గొని కేసుల నుంచి బయటపడవచ్చన్నారు. కేసులను రాజీ చేసుకుంటే భవిష్యత్‌లో అప్పీలు చేసుకునేందుకు అవకాశం లేకుండా శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. కక్షిదారులు వారి కేసులను రాజీ చేసుకుంటే ఇరు పార్టీలు విజయం సాధించినట్లేన్నారు. సమయం, డబ్బు వృథా కాదన్నారు.

పరిశోధన ప్రాజెక్టుకు ఎంపిక

శృంగవరపుకోట: మండలంలో వీరనారాయణం గ్రామానికి చెందిన డాక్టర్ రంధి రామానాయుడుకి 'నేషనల్ బోర్డ్ ఆఫ్ హయ్యర్ మాథమెటిక్స్' రీసెర్చ్ ప్రాజెక్టును అప్పగించింది. 'మోడల్ బేస్డ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మెథడ్స్ ఫర్ స్పార్స్ సిగ్నల్ రికవరీ థియరీ అండ్ అప్లికేషన్స్ ఇన్ ఇమేజింగ్' పరిశోధనలో భాగంగా కృత్రిమ మేధ(ఎ.ఐ)తో వైద్య, వ్యవసాయ రంగాల్లో అల్గోరిథమ్స్ తయారు చేయటమే తన లక్ష్యమని రామానాయుడు తెలిపారు. ప్రస్తుతం ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీలో సహాయ ఆచార్యునిగా పనిచేస్తున్న రామానాయుడు గతంలో యంగ్ సైంటిస్ట్ అవార్డు అందుకున్నారు. భారత అణుశక్తి సంస్థ మూడేళ్ల పాటు నిర్వహించనున్న ఈ ప్రాజెక్టుకు రామానాయుడును ఎంపిక చేయటం పట్ల స్థానికులు, మిత్రులు, బంధువులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రూ.500లకే పశువులకు కృత్రిమ గర్భధారణ ఇంజక్షన్

చీపురుపల్లి రూరల్(గరివిడి): ఆడదూడలను మాత్రమే పుట్టించగలిగే కృత్రిమ గర్భధారణ ఇంజక్షన్లు రైతుభరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయని పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ వైవీ రమణ అన్నారు. జాతీయ కృత్రిమ గర్భధారణ కార్యక్రమంలో భాగంగా గరివిడి మండలం దుమ్మేద గ్రామంలో బుధవారం లేగదూడల ప్రదర్శన నిర్వహించారు. మేలైన ఆవుదూడలను ఎంపిక చేసి వాటి యజమానులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ ఆవులకు కృత్రిమ గర్భధారణ ఇంజక్షన్లు చేయించే పాడిరైతులు రూ.500లు చెల్లిస్తే రెండు సార్లు కృత్రిమ గర్భధారణ చేస్తారని, చూడి నిలబడని పక్షంలో రైతు చెల్లించిన రూ.500లు తిరిగి చెల్లిస్తారని వివరించారు. ఈ పథకంలో ఆడదూడలు కచ్చితంగా జన్మిస్తాయని, మగదూడలు పుట్టిన ఎడల రూ.250లు రైతుకి చెల్లిస్తారని తెలిపారు. అదే విధంగా మండలంలో 50 టన్నుల సంపూర్ణ మిశ్రమ దాణాను రైతుభరోసా కేంద్రాల ద్వారా అందిస్తున్నామన్నారు. 200 కిలోల మిశ్రమదాణా కోసం రైతులు రూ.1300లు చెల్లించాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో పశుసంవర్ధకశాఖ అధికారులు డీడీ డా.రామచంద్రరావు, సీఈఓ డా.దామోదరావు, మండల వెటర్నరీ ఆఫీసర్ బి.శ్రీనివాస్, స్థానిక సర్పంచ్ జమ్ము రామునాయుడు, పాడిరైతులు పాల్గొన్నారు.

సంక్షేమ పాలనతో ప్రతి ఇంటా సంతోషం

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి



లబ్ధిదారుకు అందిన సంక్షేమ పథకాలను వివరిస్తూ, బుక్‌లెట్లు పంపిణీ చేస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల, తదితరులు

విజయనగరం: ప్రభుత్వ సంక్షేమ పాలనతో ప్రతి ఇంటా సుఖ, సంతోషాలు వెల్లివిరుస్తున్నాయని.. మరోమారు జగన్ మోహన్‌రెడ్డినే ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 30వ డివిజన్ ధర్మపురిలో బుధవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ హయాంలో సంక్షేమ పథకాల వల్ల కలిగిన లబ్ధిని వివరిస్తూ, ముఖ్యమంత్రి సందేశంతో కూడిన బుక్‌లెట్లను పంపిణీ చేశారు. అనంతరం ప్రజా సమస్యలపై ఆరా తీశారు. కాలువలో పూడికలు పేరుకుపోవడంతో పారిశుధ్య పర్యవేక్షకుడిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. శాశ్వత పరిష్కారానికి తగు చర్యలు చేపట్టాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, జోనల్ ఇన్‌చార్జ్ మారం బాలబ్రహ్మారెడ్డి, స్థానిక కార్పొరేటర్ పతివాడ గణపతిరావు మాట్లాడుతూ, రాష్ట్రంలో ప్రజారంజకు పాలన సాగుతోందన్నారు. జిల్లా కేంద్రంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి నేతృత్వంలో అభివృద్ధి శరవేగంగా జరుగుతోందని తెలిపారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పర్యటిస్తున్న ప్రతి ప్రాంతంలో ముఖ్యంగా మహిళలు జగనన్నపై అభిమానాన్ని బహిరంగంగానే వెల్లడిస్తున్నారని చెప్పారు. అమ్మఒడి, ఆసరా, పింఛన్లు, వసతి దీవెన, సున్నా వడ్డీ, వంటి అనేక సంక్షేమ పథకాలు అందుతూ ప్రతి ఇంటా ఆనందం వెల్లివిరుస్తోందన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకే మరోమారు పట్టం కట్టాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రేవతీదేవి, అసిస్టెంట్ కమిషనర్ ప్రసాదరావు, జోనల్ ఇన్‌చార్జ్ బొద్దాన అప్పారావు, డివిజన్ ఇన్‌చార్జ్ పూసర్ల శ్రీనివాసరావు, మహిళా అధ్యక్షురాలు చందక ఆదిలక్ష్మి, యువజన అధ్యక్షుడు సువ్వాడ జయరాం, తదితరులు పాల్గొన్నారు.

జగనన్నతోనే సంక్షేమం

- ఎమ్మెల్యే బడ్డుకొండ



లబ్ధిదారులకు బుక్‌లెట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, తదితరులు

పూసపాటిరేగ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డితోనే రాష్ట్రంలో సంక్షేమం సాధ్యమవుతుందని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. మండలంలోని ఎరుకొండలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు, సచివాలయ సిబ్బంది, స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. ఒక్కో ఇంటికి సంక్షేమ పథకాల వల్ల ఎంత లబ్ధి చేకూరినదీ వివరిస్తూ, ముఖ్యమంత్రి సందేశంతో కూడిన బుక్‌లెట్లను పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, గ్రామంలో ఇళ్లు లేని నిరుపేదలుంటే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పేదల అభ్యున్నతే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి విప్లవాత్మకమైన పథకాలు ప్రవేశపెట్టారన్నారు. ప్రభుత్వసేవలు పొందేందుకు ఏ ఒక్కరూ ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో సచివాలయ వ్యవస్థ తీసుకువచ్చారని చెప్పారు. దేశం మొత్తం గుర్తించే విధంగా రాష్ట్రంలో గ్రామ సచివాలయ వ్యవస్థతో సుపరిపాలన అందిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలే మంత్రంగా వచ్చే సార్వత్రిక ఎన్నికలకు వెళ్తామన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరిచిన హామీల్లో 99 శాతం వరకు అమలు చేసినట్లు తెలిపారు.

ప్రజల కష్టాలు నేరుగా తెలుసుకుని, పరిష్కరించేందుకే గడప గడపకు.. కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఎరుకొండ ఎస్సీ కాలనీ నుంచి ఆర్‌అండ్‌బీ రహదారి గుండా డ్రైనేజీ మంజూరు చేశామన్నారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకే ప్రతిపక్షాలు విమర్శలు చేస్తున్నాయని మండిపడ్డారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పతివాడ అప్పలనాయుడు, ఎంపీపీ మహంతి కల్యాణి, వైస్ ఎంపీపీలు అల్లాడ రమేష్, ఎన్.సత్యనారాయణరాజు, ప్రజాప్రతినిధులు మహంతి శ్రీనివాసరావు, మహంతి జనార్దనరావు, పి. లక్ష్మీనారాయణ, పిన్నింటి శ్రీనివాసరావు, లంకలపల్లి రాజారావు, పిన్నింటి నారాయణరావు, గొంప సన్యాసిరావు, పీర్‌లెస్ అప్పలనాయుడు, ఎంకే మోహన్, ఇజ్జరోతు రామునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమానికి చిత్తశుద్ధితో కృషి చేయండి

- ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు



మొయిద సచివాలయంలో సమీక్ష జరుపుతున్న ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు

నెల్లిమర్ల రూరల్: ప్రజా సంక్షేమానికి అధికారులు చిత్తశుద్ధితో కృషి చేయాలని ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు సూచించారు. మండలంలోని మొయిద విజయరాంపురం గ్రామ సచివాలయాన్ని బుధవారం సందర్శించి మండల స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తన సుదీర్ఘ పాదయాత్రలో ప్రజల కష్టాలను అతి దగ్గరగా చూశారన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజల సమస్యల పరిష్కారానికి సచివాలయ వ్యవస్థను అందుబాటులోకి తీసుకువచ్చారని చెప్పారు. వలంటీర్లను నియమించి గడప వద్దకే సంక్షేమ పథకాలు అందించే వెసులుబాటు కల్పించారని తెలిపారు. గత ప్రభుత్వంలో పసుపు చొక్కాలు వేసుకుంటేనే పథకాలు ఇచ్చేవారని...నేడు ఆ పరిస్థితి ఎక్కడా లేదన్నారు. అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేసి ప్రభుత్వ సేవలను ప్రజలకు దగ్గర చేయాలని అధికారులను ఆదేశించారు. జగనన్న ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని..ఇళ్లు లేని నిరుపేదల సొంత ఇంటి కలను నెరవేర్చాలన్నారు. అనంతరం నారాయణపట్నం, పూతికపేట గ్రామాల అధికారులు, వలంటీర్లతో సమీక్ష జరిపి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో సర్పంచ్ అట్టాడ కృష్ణ, పీఏసీఎస్ చైర్మన్ అట్టాడ కనకారావు, సచివాలయ కన్వీనర్ శ్రీనివాసరావు, గ్రామ పెద్దలు, అధికారులు పాల్గొన్నారు.

రీసర్వే ప్రారంభం



డ్రోన్ సర్వే ప్రారంభిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

నెల్లిమర్ల: ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జగనన్న శాశ్వత భూ హక్కు - భూ రక్ష పథకం రీ సర్వే నగర పంచాయతీలో బుధవారం ప్రారంభమైంది. సర్వేలో భాగంగా స్థానిక బృందావన్ వ్యాలీలో కమిషనర్ పి.బాలాజీప్రసాద్, చైర్‌పర్సన్ బంగారు సరోజిని, వైస్ చైర్మన్లు సముద్రపు రామారావు, కారుకొండ వెంకట కృష్ణారావు డ్రోన్ సర్వే ప్రారంభించారు. ముందుగా పట్టణ పరిధిలోని ఇళ్లు, భవనాలు, ప్రైవేటు స్థలాల సర్వే జరుగుతుందని, పట్టణవాసులు సహకరించాలని కోరారు. సర్వే త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. టీపీబీఓ ఎంపీ జనార్దనరావు పర్యవేక్షణలో ప్రారంభమైన కార్యక్రమంలో వార్డు ప్లానింగ్ కార్యదర్శులు, వీఆర్వోలు పాల్గొన్నారు.

స్కిల్ హబ్ ప్రారంభం



స్కిల్ డవలప్‌మెంట్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య

గజపతినగరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఏపీ స్టేట్ స్కిల్ డవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎస్ఎస్‌డీసీ) ఆధ్వర్యంలో ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గంలో ఒక స్కిల్ హబ్‌ను ఏర్పాటు చేయడం జరిగిందని, నిరుద్యోగ యువత వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అన్నారు. గజపతినగరం ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఏర్పాటు చేసిన స్కిల్ హబ్‌ను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ స్కిల్ హబ్‌లో యువతకు పారిశ్రామిక అవసరాలకు తగిన నైపుణ శిక్షణ ఇవ్వడంతో పాటు ఉపాధి అవకాశాలు కల్పించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బెల్లాన జ్ఞానదీపిక, ఏఎంసీ చైర్మన్ వేమలి ముత్యాలనాయుడు, జెడ్పీటీసీ సభ్యుడు గార తవుడు, కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ డైరెక్టర్ రెడ్డి పద్మావతి, పార్టీ మండల అధ్యక్షుడు బూడి వెంకటరావు, స్కిల్ డవలప్‌మెంట్ జిల్లా అధికారి డాక్టర్ ఎస్.గోవిందరావు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్.విజయకుమారి, తహసీల్దార్ ఎం.అరుణకుమారి, ఎంపీడీఓ పి.సుదర్శనం, సీనియర్ నేతలు బెల్లాన త్రినాథరావు, మండల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పెద్ద చెరువు కల్వర్టుకు మరమ్మతులు



జేసీబీ యంత్రంతో పాత కల్వర్టును తొలగిస్తున్న దృశ్యం

విజయనగరం: నగరంలోని పెద్ద చెరువుకు వెళ్లే ప్రధాన కాలువలో తరచూ ఏర్పడుతున్న అవాంతరాలకు శాశ్వత పరిష్కారం చూపుతూ పెద్ద కాలువ పనులు చేపడుతున్నారు. గంటస్తంభం జంక్షన్ నుంచి పెద్ద చెరువు వైపు వెళ్లే ప్రధాన కాలువకు సంబంధించి స్థానిక పెద్దబజార్‌కు వెళ్లే మార్గంలో నూతన కల్వర్టు నిర్మాణానికి చర్యలు ప్రారంభించారు. ఈ మేరకు పాత కల్వర్టును తొలగించి కొత్త కల్వర్టు పనులు జోరందుకున్నాయి. పెద్ద చెరువుకు వెళ్తున్న ప్రధాన కాలువలో తరచూ పూడికలు పేరుకుపోతుండడంతో భారీ వర్షాలు పడినప్పుడు ముంపు సమస్య తలెత్తేది. సమస్య పరిష్కారానికి దృష్టి సారించిన అధికారులు దశల వారీగా కాలువ మరమ్మతులు చేస్తున్నారు.

పీవీ రావు ఆశయసాధనకు కృషి చేయాలి

- మాలమహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణ



పీవీ రావు చిత్రపటానికి పూలమాల వేస్తున్న రామకృష్ణ

విజయనగరం ఫోర్ట్: మాల మహానాడు వ్యవస్థాపకుడు పీవీ రావు ఆశయ సాధనకు మాలలంతా కృషి చేయాలని మాలమహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లోగిశ రామకృష్ణ పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక మాలమహానాడు కార్యాలయంలో పీవీ రావు జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రామకృష్ణ మాట్లాడుతూ, ఎస్సీ రిజర్వేషన్‌కు వ్యతిరేకంగా పోరాటం చేసి వర్గీకరణను అడ్డుకున్నారన్నారు. మాలల రిజర్వేషన్లను కాపాడిన గొప్ప వ్యక్తి పీవీ రావు అని అన్నారు. కార్యక్రమంలో చీడి రామకృష్ణ, దమరసింగి ఈశ్వరావు, ఉప్పాడ పైడితల్లి, ఎద్దు మనోహర్, చోళ్ల రాజకుమారి, వప్రి సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

అవగాహనతోనే రోడ్డు ప్రమాదాల నివారణ



రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన

- రహదారి భద్రత ప్రాంతీయ అధ్యక్షుడు అప్పారావు

విజయనగరం టౌన్: అవగాహనతోనే రోడ్డు ప్రమాదాలు నివారించవచ్చునని విజయనగరం జిల్లా రహదారి భద్రత ప్రాంతీయ అధ్యక్షుడు మజ్జి అప్పారావు సూచించారు. జాతీయ రహదారి భద్రత దృష్టిలో ఉంచుకుని 46వ డివిజన్ విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో కార్పొరేటర్ టి. నారాయణప్పుడు ఆధ్వర్యంలో బుధవారం విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రవాణా శాఖాధికారి రవిశంకర్ మాట్లాడుతూ, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. కారులో ప్రయాణించేవారు సీట్‌బెల్ట్ ధరించాలని సూచించారు. క్షతగాత్రులకు అందించే ప్రథమ చికిత్సపై డాక్టర్ సాయికుమార్ వివరించారు. కార్యక్రమంలో రోడ్ సేఫ్టీ ఎన్జీఓ జిల్లా కార్యదర్శి సైలాడ శ్రీహరిబాబు, సభ్యులు శ్రీరామమూర్తి, 46వ డివిజన్ అడ్మిన్ సచివాలయం సిబ్బంది, వలంటీర్లు, డివిజన్ ప్రజలు పాల్గొన్నారు.

మరీ ఇంత బరితెగింపా..!

- చంపావతి నది వంతెన కిందనే ఇసుక తవ్వకాలు
- అధికారుల మధ్య సమన్వయలోపంతో చెలరేగుతున్న అక్రమార్కులు



వంతెన కింద ఇసుక తవ్వకాలు

నెల్లిమర్ల: పట్టణానికి చెందిన పలువురు ఇసుక అక్రమార్కులు మరీ బరితెగించారు. తమ స్వప్రయోజనాల కోసం ప్రజా ఆస్తులకు ప్రమాదం తలపెడుతున్నారు. పట్టణంలోని ప్రధాన రహదారిలో చంపావతి నదిపై ఉన్న వంతెన కిందనే ఇసుక తవ్వకాలు చేపడుతున్నారు. వంతెన స్తంభాలను ఆనుకుని పట్టపగలే తవ్వకాలు చేపడుతుండడం గమనార్హం. ఇసుకను తవ్వి మూటలుగా కట్టి తరలిస్తున్నారు. ప్రతిరోజూ టన్నుల కొద్దీ ఇసుక తరలిస్తున్నారు. ఇసుక తవ్వకాలతో ఇప్పటికే ఈ ప్రాంతమంతా పెద్ద పెద్ద గోతులేర్పడ్డాయి. దీంతో నదిలో ఏ మాత్రం ప్రవాహం మొదలైనా వంతెనకు ప్రమాదం వాటిల్లే అవకాశముంది. ఇంత జరుగుతున్నా రెవెన్యూ అధికారులు గాని పోలీసులు గాని ఆర్‌అండ్‌బీ అధికారులు గాని పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. కళ్ల ముందే అక్రమ తవ్వకాలు చేపడుతున్నా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉంటే ఇసుక తవ్వకాలకు సంబంధించి పోలీసులు, నగర పంచాయతీ అధికారులు తమకు సహకరించడం లేదని రెవెన్యూ అధికారులు చెబుతుండడం విశేషం. ఈ నేపథ్యంలో కనీసం వార్డు సచివాలయ కార్యదర్శులు అయినా పట్టించుకుని, ఇసుక అక్రమ తవ్వకాలను ఆపాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయాన్ని తహసీల్దార్ కేవీ రమణరాజు వద్ద ప్రస్తావించగా.. వంతెన కింద ఇసుక తవ్వకాలపై ఇప్పటికే దాడులు నిర్వహించామన్నారు. తవ్వకాలను పూర్తిస్థాయిలో నిరోధించడానికి చర్యలు చేపడతామన్నారు.

ధర్మ పరిరక్షణకు మహాయజ్ఞం

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి



మాట్లాడుతున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: సనాతన ధర్మ పరిరక్షణ.. రాష్ట్రాభివృద్ధిని కాంక్షిస్తూ లోక కల్యాణార్థం ప్రభుత్వం మహాయజ్ఞం నిర్వహించనుందని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్మామి తెలిపారు. విజయనగరంలోని తన నివాసం వద్ద జిల్లా దేవదాయ, ధర్మాదాయ శాఖాధికారి కేఎల్ సుధారాణితో కలసి బుధవారం విలేకరులతో మాట్లాడుతూ, ఈ నెల 12 నుంచి 17వ తేదీ వరకు విజయవాడలోని మున్సిపల్ స్టేడియంలో అష్టోత్తర శత కుండాత్మక చండీ రుద్ర రాజశ్యామల సుదర్శన సహిత శ్రీలక్ష్మీ మహాయజ్ఞం నిర్వహించనున్నట్లు చెప్పారు. తొలి, చివరి రోజు కార్యక్రమాల్లో ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి పాల్గొంటారని చెప్పారు. ఆరు రోజుల పాటు జరిగే మహాయజ్ఞంలో పలువురు పీఠాధిపతులు ప్రవచనాలు ఇస్తారన్నారు. అనంతరం కార్యక్రమానికి సంబంధించిన ప్రచార కరపత్రాలను ఆవిష్కరించారు.

మహిళలందరికీ కృతజ్ఞతలు: కోలగట్ల

రాష్ట్రంలోనే ప్రథమ మహిళా పార్కు ప్రారంభోత్సవాన్ని విజయవంతం చేసిన ప్రతి ఆడపడుచుకూ కోలగట్ల వీరభద్ర స్వామి కృతజ్ఞతలు తెలియజేశారు. మంచి కార్యక్రమానికి ప్రజల మద్దతు ఎప్పుడూ ఉంటుందని మరోసారి రుజువైందన్నారు. మహిళా పార్కు మన విజయనగరానికే గర్వ కారణమన్నారు.

చట్టబద్ధంగా వ్యాపారాలు సాగించాలి

చీపురుపల్లి: విత్తనాలు, ఎరువులు విక్రయించే రైతులు చట్టబద్ధంగా వ్యాపారాలు సాగించాలని, లేదంటే లైసెన్స్‌లు రద్దు చేయడం జరుగుతుందని వ్యవసాయశాఖ జాయింట్ డైరెక్టర్ కేటీ రామారావు హెచ్చరించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో చీపురుపల్లి వ్యవసాయశాఖ సబ్ డివిజనల్ స్థాయిలో విత్తనాలు, ఎరువులు, క్రిమి సంహారక మందులు విక్రయించే డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీలర్లు నిబంధనలకు విరుద్ధంగా వ్యాపారాలు సాగించాలనుకుంటే కుదరదని స్పష్టం చేశారు. డీలర్లు తెప్పించుకునే సరుకుల నుంచి విక్రయించే సరుకుల వరకు వివరాలన్నీ వ్యవసాయశాఖకు తెలియజేయాల్సి ఉందన్నారు. అంతేకాకుండా తప్పనిసరిగా రికార్డులు నిర్వహించాలన్నారు. విత్తనాలు స్టాకు వచ్చినప్పుడే మొలకశాతం కట్టాలని, అదే విషయాన్ని మండల వ్యవసాయ అధికారులు దృష్టికి తీసుకెళ్లాలన్నారు. వ్యవసాయ అధికారులు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన తరువాతే విక్రయాలు జరపాలని సూచించారు. ఖరీఫ్ సమీపిస్తున్న తరుణంలో విత్తనాలు స్టాకు సిద్ధం చేసుకోవాలన్నారు.